దుర్కి–బీర్కూర్ రోడ్డుకు మోక్షం ఎన్నడో..?

- రూ.13 కోట్లు నిధులు మంజూరైనా ముందుకు కదలని పనులు
- అడుగుకో గుంత
- ప్రమాదాలకు నెలవుగా మారిన రోడ్డు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


దుర్కి–బీర్కూర్ రోడ్డు


అధ్వానంగా ఉన్న దుర్కి–వీరాపూర్ రోడ్డు

నస్రుల్లాబాద్ : అడుగుకో గుంత.. అడుగేస్తే గుంత అన్నట్లు ఉంటుంది దుర్కి–బీర్కూర్ రోడ్డు పరిస్థితి. నస్రుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్ గ్రామాన్ని ఒక సీసీ రోడ్డు రెండు గ్రామ పంచాయతీలుగాను, రెండు మండలాలుగా విడదీసింది. అందులో భాగంగానే ఇంత కాలం ఒకే గ్రామంగా ఉన్న ప్రజలు ఇప్పుడు రెండు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నస్రుల్లాబాద్–బీర్కూర్ మండలాలను కలుపుతూ డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని 2023 అక్టోబర్ 9న రూ.13 కోట్లతో శంకుస్థాపన చేశారు. కాని రోడ్డు పనులు, టెండరు నిలిచిపోయాయి. బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామ ప్రజలు నిత్యం బీర్కూర్ ప్రయాణించాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకోవాల్సిందే. ఇంటి నుండి వెళ్లిన మనిషి గాయాలు కాకుండా రావడం గగనమే. ఇప్పటి వరకు వారంలో రెండు మూడు ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. మూడు నెలల క్రితం ఓ వ్యక్తి కుటుంబ సభ్యులతో మహారాష్ట్రకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో గుంతలో ద్విచక్ర వాహనం పడి మంచాన పడ్డాడు. దీనితో కుటుంబ పోషణ భారంగా మారింది. మిర్జాపూర్, వీరాపూర్, దుబ్బ గ్రామాల ప్రజల పొలాలు సైతం పెద్ద సంఖ్యలో ఈ రోడ్డు వైపే ఉన్నాయి. దీనితో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

జుక్కల్ ప్రజలకు ఈ దారి దగ్గర..

జుక్కల్ నియోజకవర్గ ప్రజలకు సైతం ఈ దారి పూర్తయితే జిల్లా కేంద్రానికి వెళ్లడానికి దగ్గర దారి అవుతుంది. బీర్కూర్ మండలం మంజీరా నదిపై వంతెన నిర్మించడంతో అధిక సంఖ్యలో మద్నూర్, బిచ్కుంద, డోంగ్లీ ప్రజలు బీర్కూర్ నుంచే జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. దుర్కి–బీర్కూర్ రోడ్డు పూర్తి అయితే సుమారు 8 కి.మీ దూరం తగ్గుతుంది.


మిర్జాపూర్–బీర్కూర్ రోడ్డు పరిస్థితి

త్వరగా పూర్తి చేయాలి

దుర్కి–బీర్కూర్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి. గతంలో ప్రారంభించిన పనులు నిలిచిపోవడంతో 2 ఏళ్లు పూర్తి కావస్తున్నా కూడా ఆమాటే ఎత్తడం లేదు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలి.

– శ్రీనివాస్, మిర్జాపూర్ గ్రామస్తుడు

ఫలితం లేదు

రోడ్డు ప్రమాదకరంగా ఉందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాని ఎవ్వరు పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కన్నా ఆగిపోయిన పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతున్నాము.

– భాస్కర్, మిర్జాపూర్ గ్రామస్తుడు

మురికి గుంత.. తీరేనా చింత?


మద్నూర్‌లో గాంధీచౌక్‌కు వెళ్లే దారిలో గుంత


విఠలేశ్వర ఆలయ వద్ద..

మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని మురికి కాలువల పైకప్పులు తొలగించడంతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు. ఆదమరిచి నడిస్తే మురికి గుంతలో పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌కు వెళ్లే దారిలో, విఠలేశ్వర ఆలయం వద్ద గల ఇరుకు రోడ్డుపై గుంతలతో తిప్పలు పడుతున్నామని కాలనీవాసులు అంటున్నారు. వృద్ధులు, చిన్నారులు పడి గాయాలపాలవుతున్నారని, అధికారులు స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కంచెలు కరువు.. ప్రమాదాలకు నెలవు


ధర్మారావ్‌పేట్‌లోని ట్రాన్స్‌ఫార్మర్


సదాశివనగర్‌లోని పాతూరి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రోడ్ల పక్కన నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. అటుగా వెళ్లే మూగజీవాలు టాన్స్‌ఫార్మర్‌ల వైపునకు వెళ్తూ కరెంట్ షాక్‌కు గురవుతున్నాయి. అయినా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. ఉత్తనూరు, ధర్మారావుపేట, సదాశివనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేకుండా ఉన్నాయి. అధికారులు దృష్టి సారించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచెలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


ఉత్తునూర్ శివారులో ..

క్లుప్తంగా

రేషన్ కార్డులు పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీంద్‌రెడ్డి చేతుల మీదుగా కొత్త రేషన్ కార్డులను అందజేశారు. మండల పరిధిలో కొత్త రేషన్ కార్డులు మంజూరైన లబ్ధిదారులు సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు రమేష్‌యాదవ్, సిద్దు తదితరులున్నారు.

అభినందనలు



బాన్సువాడ రూరల్: వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన బాన్సువాడకు చెందిన పిట్ల శ్రీధర్‌ను ఆదివారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. తన శిష్యుడు జాతీయ అధ్యక్షునిగా ఎన్నికవడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా పిట్ల శ్రీధర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌ను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. నాయకులు, వడ్డెర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి



బాన్సువాడ రూరల్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, నాణ్యమైన విద్యకోసం మైనార్టీ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎల్లారెడ్డిలోని మైనార్టీ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, శివప్రసాద్, నవీన్‌కుమార్, శేఖర్‌లు కోరారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలోని ఇస్లాంపుర,"ఇర్దోస్, అర్బాత్ కాలనీల్లో పాఠశాలలో అడ్మిషన్ల కోసం ప్రచారం చేపట్టారు. ఇంగ్లీష్ మీడియంలో బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, కాస్మోటిక్‌చార్జీలు, పౌష్టికాహారంతో కూడిన భోజన వసతి సౌకర్యాలు ఉన్నాయన్నారు. ముస్లిం విద్యార్థులకు ఉర్దూ, అరబ్బీ, నమాజ్ సౌకర్యం ఉంటుందన్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ఎల్లారెడ్డిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

చలో గన్‌పార్క్‌ను జయప్రదం చేయండి



బాన్సువాడ రూరల్: ఈ నెల 22న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గన్‌పార్క్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి మలిదశ ఉద్యమ కారులు హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉడుత గంగాధర్ కోరారు. ఆదివారం ఆయన బాన్సువాడ ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను జార్ఖండ్ ప్రభుత్వం గుర్తించిన విధంగా తెలంగాణ ప్రభుత్వం గుర్తించాలన్నారు. గంజివార్ చందు, భాస్కర్‌గౌడ్, కృష్ణ, దత్తు గంగారాం తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఆదివారం వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి, హెల్మెట్లు ధరించని వారికి జరిమానాలు విధించారు. అలాగే పెండింగ్ చలానాలు కట్టేలా చర్యలు తీసుకున్నారు. ఎస్సై మురళి, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

పస్కరాజుల పండుగ



బాన్సువాడ రూరల్: బోర్లం, బోర్లంక్యాంపు గ్రామాల్లో ఆదివారం పస్కరాజుల పండుగ జరుపుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండాలని పాడిపంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రతి ఏటా పండుగ చేస్తామని గ్రామస్తులు తెలిపారు. బాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా వెళ్లి పస్కరాజులకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వనభోజనాలు చేశారు.

కల్తీకల్లు పేరిట దాడులను ఆపాలి


మాట్లాడుతున్న గౌడ ఉద్యమం నాయకులు

కామారెడ్డి టౌన్: కల్తీ కల్లు పేరిట గౌడ కులస్తులపై ఎక్సైజ్ అధికారులు చేస్తున్న దాడులను ఆపాలని జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళి గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. కల్తీ జరిగితే చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో గెలవడానికి మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఐదు ఎకరాల స్థలం, డ్రిప్ సౌకర్యం కల్పించి ఈత చెట్లను పెంచే విధంగా ప్రోత్సహించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, నాయకులు సిద్ధ గౌడ్, శేఖర్ గౌడ్, సురేష్ గౌడ్, ప్రశాంత్ గౌడ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మార్కెట్‌లో రాకపోకలకు ఇబ్బందులు


నిలిచిన వాహనాలతో ఇబ్బందులు పడుతున్న జనాలు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని డైలీ మార్కెట్‌లో ఆదివారం వాహనాలు నిలిచిపోవడంతో జనాలు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం బోనాల పండుగతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు డైలీ మార్కెట్‌లో మటన్, కూరగాయలు, చికెన్‌తో పాటు కిరాణ సరుకులు కొనేందుకు రావడంతో మార్కెట్ కిక్కిరిసి పోయింది. రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి.

మరమ్మతులకు నోచుకునేనా?


మల్లుపేట్‌లో నిరుపయోగంగా మారిన హైమాస్ట్ లైట్లు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మల్లుపేట్‌లో గతంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఏర్పాటు చేసిన కొద్ది రోజులు మాత్రమే వెలుగులు ఇచ్చాయని, ఆ తర్వాత వెలుగులు రావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాల నిర్మాణానికి విరాళం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సేవాలాల్, జగదాంబ ఆలయాల నిర్మాణానికి ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎర్రబోగడ భీంరావు 50 బస్తాల సిమెంటును విరాళంగా అందజేసినట్లు మండల బంజారా అధ్యక్షుడు దేవిదాస్ తెలిపారు. ఈ సందర్భంగా భీంరావు మాట్లాడారు. ఆలయాల నిర్మాణం కోసం తనవంతు విరాళం అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం దాతను సన్మానించారు. నేతలు వెంకట్‌రెడ్డి, కృష్ణ, జగ్యానాయక్, విశ్వేశ్వర్‌శర్మ, రాజు, గన్నూనాయక్ పాల్గొన్నారు.

సమాచారం..

డిగ్రీ ఓపెన్ వర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభం

బాన్సువాడ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–26 విద్యాసంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ శంకర్‌రావు తెలిపారు. ఇంటర్ పాస్ అయినవారు డిగ్రీలో నేరుగా అడ్మిషన్ పొందవచ్చన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు కులధృవీకరణ, ఆధార్‌కార్డు, ఫోటోలతో ఏదైనా ఆన్‌లైన్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఫారాన్ని స్టడీసెంటర్‌లో అందజేసి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు 13 వరకు అడ్మిషన్ పొందడానికి గడువు ఉందన్నారు. గత ఏడాది డిగ్రీ మొదటి, రెండో సంవత్సరంలో జాయిన్ అయిన వారు ఈఏడాది రెండో, మూడో సంవత్సరానికి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కొనసాగుతున్న స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, కామర్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ బోధన కోసం లెక్చరర్లు కావాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23 మధ్యాహ్నం వరకు బిచ్కుంద డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ముందు ప్రాధాన్యత ఉంటుందన్నారు. 24న కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు..

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల(అటానమస్)లో 2025–26 విద్యా సంవత్సరానికి గానూ అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ గంగాధర్ అన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో బోటనీ, కామర్స్, క్రాప్ ప్రొడక్షన్, ఎకనామిక్స్, హిస్టరీ, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు, కెమిస్ట్రీ ఒక్కొక్క పోస్టు చొప్పున ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే కంప్యూటర్ అప్లికేషన్, ఇంగ్లీష్‌లో రెండు చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 13 పోస్టులతో పాటు ఉర్దూ మీడియంలో బోటనీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలికల్‌సైన్స్, ఉర్దూ, జువాలజీ సబ్జెక్టులలో ఒక్కోటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 23న సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24న ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల కామారెడ్డిలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఎంపికలో నెట్, సెట్, పీహెచ్‌డీ, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి..

బాన్సువాడ రూరల్: జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆర్థిక సాయం పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. ఆర్థికంగా బలహీనంగా ఉండి కుటుంబ పోషణ కర్త మృతి చెందితే ప్రభుత్వం రూ.20వేలు ఆర్థికసాయం అందిస్తుందన్నారు. పథకానికి అర్హత పొందాలంటే మృతిని వయస్సు 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండి 17 ఏప్రిల్, 2017 తర్వాత మృతి చెంది ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు డెత్ సర్టిఫికేట్, తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్సులతో తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

23న వైద్యనాథేశ్వరునికి సామూహిక రుద్రాభిషేకం

కామారెడ్డి అర్బన్: స్థానిక లిటిల్ స్కాలర్స్ స్కూల్ సమీపంలోని శ్రీజయదుర్గా సమేత వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో 23న మాస శివరాత్రి సందర్భంగా బుధవారం సాయంత్రం 5.30 గంటలకు సామూహిక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

27న గాంధారిలో గిరిజన గర్జన సభ

కామారెడ్డి అర్బన్: లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 27న గాంధారిలో నిర్వహించే గిరిజన గర్జన సభను విజయవంతం చేయాలని సమితి యూత్ రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ మోతిలాల్ పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయం సమీపంలోని సమితి జిల్లా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్ బోలి భాషను చేర్చాలని, గిరిజన పోడు భూములు, అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరించాలని, గోర్ ధర్మ సమాజ్ పరిరక్షణ చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తు గాంధారి గిరిజన సభను నిర్వహిస్తున్నామని అన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు గణేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శి బద్రినాయక్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవినాయక్, గౌరవ అధ్యక్షుడు రూప్‌సింగ్ నాయక్, వర్కింగ్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు మోహన్‌నాయక్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు ప్రకాష్ నాయక్, కామారెడ్డి మండల అధ్యక్షుడు గోపినాయక్, ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా తీజ్ సంబురాలు


వజ్జపల్లి తండాలో సంబురాల్లో పాల్గొన్న గిరిజన యువతులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని వజ్జపల్లి తండా, యాచారం తండాలలో ఆదివారం తీజ్ సంబురాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారాల సంస్కృతికి ప్రతీకగా ఈ పండుగను నిర్వహిస్తున్నట్లు బంజార కుల పెద్ద మనుషులు పేర్కొన్నారు. యువతులు, మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగను నిర్వహించారు.

కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- పట్టించుకోని అధికారులు



భిక్కనూరు: తిప్పాపూర్‌లో వ్యవసాయ బావుల వద్ద ఉన్న ఎస్ఎస్– 39 ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, విద్యుత్తు అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వచ్చి చూశారని రైతులు తెలిపారు. దోమకొండ ఎస్‌పీఎంకు ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువెళతామని రైతులు తెలపగా, 4 రోజుల తరువాత తీసుకురమ్మన్నారని చెప్పారు. వరి నాట్లు వేసే సమయంలో అధికారులు పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షిప్తం

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవి చౌహాన్



రాజంపేట: లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలానికి చెందిన రవి చౌహాన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో యూత్ రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ మోతిలాల్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రవి చౌహాన్ మాట్లాడుతూ.. లంబాడ హక్కుల కోసం తన వంతు సహాయ సహకారాలు అందించి అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. బద్రీనాథ్, ప్రతాప్ సింగ్, వినోద్ కుమార్‌లు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ధ్యాన మందిరం నూతన కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: స్థానిక అశోక్‌నగర్ కాలనీలోని శ్రీకృష్ణ ధ్యాన మందిరం పీఠాధిపతి మాచాలే బాబా కొంత కాలంగా అనారోగ్యంగా ఉండడంతో ఆలయ నిర్వహణ కోసం ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాచాలే బాబా, ఆయన శిష్యుడు శాస్త్రిబాబాలను సన్మానించారు. శ్రీకృష్ణ ధ్యాన మందిరం అధ్యక్షుడిగా వజీర్ శివాజీరావు, ఉపాధ్యక్షులుగా రాంచంద్రం, భూమ్‌రావు, కార్యదర్శిగా గంగాధర్, సంయుక్త కార్యదర్శులుగా సూరజ్ కరణ్, సుధాకర్‌రావు, కోశాధికారిగా మధుసూదన్‌రావు, సలహాదారులుగా పడిగెల రాజేశ్వరరావు, హరాలే సుధాకర్‌రావు, ముకుంద్‌రావు పాటు మరో 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. గతంలో ఉన్న నిర్మాణ కమిటీ యథావిధిగా కొనసాగుతుందని నూతన అధ్యక్షుడు వజీర్ శివాజీ రావు ప్రకటించారు.

పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో ఆదివారం పద్మశాలి సంఘం నూతన మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడిగా ఉష్కల్‌వార్ శ్రీనివాస్, ప్రధాన కారదర్శిగా మెరిగే శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా రచ్చ కుషాల్‌కుమార్, అందె సందీప్, ఉపాధ్యక్షుడిగా కిషన్, రాజు, సహాయ కార్యదర్శులుగా నాగేష్, నాగ్‌నాథ్, దేవిదాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వారు తెలిపారు.

దేవునిపల్లి నెహ్రూ యూత్ క్లబ్ కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి నెహ్రూ యూత్ క్లబ్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా గూడెల్లి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సాయిచరణ్, కార్యదర్శిగా ద్యావరి శ్రీకాంత్, కోశాధికారిగా ద్యావరి భానుచందర్, సలహాదారులుగా నాగార్జున, కోల శరత్ కుమార్, ద్యావరి గణేష్, బాలు, సందీప్, సతీష్, సుధీర్, శ్రీకాంత్, నరేష్, రజిత్, భువనేశ్వర్, చరణ్, వినయ్, సాయికిరణ్, నిఖిల్, అభి, శివ, సదా, అరవింద్, రాము, శ్రీకాంత్, సాకేత్‌లు ఎన్నికయ్యారు.